# పెద్దరికం

-ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్



మధ్యాహ్నం ఒంటిగంటయింది. సుబ్బారావు రైల్వే రిజర్వేషన్ క్యూలో నిల్చున్నాడు. పండుగల సీజను కావడంవల్ల క్యూ కొల్లేటి చాంతాడులా ఉంది. ఉదయం తొమ్మిదిగంటల నుంచీ సుబ్బారావు క్యూలో నుంచున్నాడు. కానీ కనీసం నాలుగు అడుగులు కూడా ముందుకు జరిగినట్లు అనిపించలేదు అతనికి. కాళ్లు పీకేస్తున్నాయి. నాలుక పిడచకట్టుకుపోతోంది. ఆకలి దంచేస్తోంది. అయినాసరే తప్పక ఓపిగ్గా నుంచున్నాడు. ఈ రోజుల్లో రిజర్వేషను లేకుండా వెళ్లడం కష్టంకదా. అందుకని కాసేపు శ్రమపడితే సుఖంగా ప్రయాణం చేయవచ్చు అని అతని అభిప్రాయం. నిజం కూడా అదే. అతనికి చిన్నప్పుడు చూసిన జోక్ గుర్తుకువచ్చింది. 'చౌక డిపో క్యూలో ఉన్నానని, త్వరలో ఇంటికి వస్తానని' ఓ అభాగ్యుడు ఇంటికి ఉత్తరం రాస్తాడు. ఇప్పుడు తను కూడా అలా లెటర్ రాయాలేమో! మనసులోని ఆలోచనకు సుబ్బారావుకు నవ్వు వచ్చింది. కాస్త రిలీఫ్‌గా అనిపించింది.

ఒకటి రెండుసార్లు తను నుంచోలేక పోతున్నానని, కొంచెం టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు వెళ్లేలా దారి ఇవ్వమని క్యూలో ముందు వున్నవాళ్లని అడిగాడు. కానీ వాళ్లు ససేమిరా అన్నారు. అంతలో కొంచెం వయసుమళ్లిన ఒకాయన వస్తే అదే జనం దయదలచి ముందుకు పోనిచ్చాడు. సుబ్బారావు మళ్లీ రిక్వెస్టు చేసాడు ముందున్న జనాన్ని. దానికి సమాధానంగా తాము కూడా ఎప్పటి నుంచో నుంచునే ఉన్నామని, సుబ్బారావు ముందుకు వెళ్లే వీలులేదని గట్టిగా చెప్పారు. 'మరి అంతకు ముందు ఒకాయనని ఎలా పంపించారు?' అని ప్రశ్నించాడు సుబ్బారావు. దానికి సమాధానంగా 'ఆయన పెద్దవారని, నుంచోలేడని ముందుకు పంపించామని, కానీ వయసులో ఉన్న మీకేమిటి?' అని సుబ్బారావు మీద కోపగించుకున్నారు జనం.

సుబ్బారావు మరింక మాట్లాడలేదు.

మధ్యాహ్నం లంచ్ టైం అయి రైల్వే వాళ్లు డ్యూటీలు మారారు. అయినా జనం కదలలేదు. సుబ్బారావూ కదలలేదు. ఎందుకంటే ఇంటికి వెళ్లి వస్తే మళ్లీ క్యూలో ఆఖరికి వెళ్లాలి. ఇప్పుడైతే కౌంటర్‌కి సగం దూరంలో ఉన్నాడు. కానీ ఆకలి, దాహం, నీరసం అతనిలో అసహనం పెంచేస్తున్నాయి. అంతలో కౌంటర్ తెరవడం, మరలా క్యూ నత్తనడక నడవడం జరిగాయి.

సుబ్బారావు క్యూ ప్రక్క నుంచి కౌంటర్ దగ్గరకు వెళ్లి అక్కడ కౌంటర్‌లో ఉన్న అమ్మాయిని రిక్వెస్ట్ చేసాడు. వెనుక జనం కేకలు వేసారు. కౌంటర్‌లో వున్న అమ్మాయి కూడా 'ఏదో పెద్దవాళ్లు అయితే సహాయం చేయవచ్చుని, సుబ్బారావులాంటి చాలామంది వయసులోవున్న వ్యక్తులు క్యూలో ఉండగా అతనికి ప్రత్యేకంగా టిక్కెట్లు ఇస్తే జనం అల్లరి చేస్తారని సారీ' అని మృదువుగా చెప్పింది. ఆ అమ్మాయి 'వయసులో వున్న' అన్న మాట అన్నందుకు జుట్టు సవరించుకున్నాడు సుబ్బారావు.

అంతలోనే వయసు మళ్లిన ఒక స్త్రీ వస్తే జనం తప్పుకుని దారిచ్చి వెంటనే టిక్కెట్ ఇప్పించారు. సుబ్బారావుకు ఒళ్లు మండిపోయింది.

“అందరికీ రూలు ఒకటే కదా?” ముందున్న వాళ్లను ప్రశ్నించాడు.

“చాల్లేండి. రేపు మనందరం ముసలివాళ్లమవుతాము. అప్పుడు మీకూ తెలుస్తుంది” అని కోపంగా అన్నారు క్యూలోనివారు. సుబ్బారావు మరింక నోరు మెదపలేకపోయాడు.

అతి కష్టంమీద నాలుగు గంటలకు టిక్కెట్లు సంపాదించి ఇంటికి చేరాడు. అప్పటికే అతని కాళ్లు తేలిపోతున్నాయి. కళ్లు గిర్రున తిరుగుతున్నాయి. ఏదో అడగబోయిన భార్యమీద అంతవరకూ అణచుకున్న కోపం వెళ్లగక్కాడు. దాదాపు కుర్చీలో కూలబడిపోయాడు. భార్య బలవంతంమీద నాలుగు మెతుకులు తిని మంచమెక్కేసాడు సుబ్బారావు. ఒళ్లు తెలియని నిద్ర పట్టేసింది.

నిద్ర లేచేసరికి రాత్రి తొమ్మిదిగంటలయింది. నిజానికి సుబ్బారావు రిటైరై ఆరునెలలు అయింది. అయినా అన్ని విధాలా కుర్రాడిలా కనిపించాలని అతని ఆరాటం. నిద్ర నుంచి లేవగానే అతను ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఇంక కుర్రాడిలా కనిపించాలని ప్రయత్నించకూడదని, కుర్రాడిలా వేషాలు వేయకూడదని, అన్నిటికీ మించి మీసాలకు, జుట్టుకు రంగు వేసుకోకూడదని, వయసుకు తగ్గట్టు హుందాగా ప్రవర్తించాలని అనుకున్నాడు. ఆ తరువాత అతనికి ఏ క్యూలోనూ కష్టపడాల్సిన అవసరం పెద్దగా రాలేదు. ఎందుకంటే పెద్దతనానికీ, పెద్దరికానికి ఇంకా గౌరవం మిగిలి ఉంది.

★